# సాక్షి
## విజయనగరం

మంగళవారం । 29 । ఆగస్టు । 2023






**అర్జీలకు సత్వర పరిష్కారం..**

'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో అందిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపుతున్నట్టు జేసీ అశోక్ తెలిపారు. - 8లో



**టీడీపీ నేతలపై పోలీసులకు ఫిర్యాదు**

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుపై పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు అందాయి. - 8లో



**'సమరభేరి' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ**

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం సమరభేరి మోగించేందుకు సన్నద్ధమవుతోంది. - 8లో

# 43,900 మందికి జగనన్న విద్యాదీవెన

- రూ.29.44 కోట్ల ఆర్థిక ప్రయోజనం
- పేద కుటుంబాల పిల్లల చదువుకు భరోసా
- విద్యార్థుల చదువులే రాష్ట్రానికి పెట్టుబడిగా విద్యాభివృద్ధి పథకాలు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

విజయనగరం జిల్లాలోని 43,900 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, ముస్లిం, కాపు, క్రిస్టియన్ విద్యార్థులకు విద్యాదీవెన పథకం కింద రూ.29,44,44,873ల నిధులను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విడుదల చేసింది. చిత్తూరు జిల్లా నగరి వేదికగా సోమవారం పేదకుటుంబాల తల్లుల బ్యాంకు ఖాతాలకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నగదు జమచేశారు. కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించిన అనంతరం కలెక్టర్ నాగలక్ష్మి విద్యాదీవెన నమూనా చెక్కును విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమాధికారి బి.రామానందం, వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఎం.యశోధనరావు, గిరిజన సంక్షేమాధికారి టి.చంద్రశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### పూర్తిఫీజు రీయింబర్స్‌మెంట్

జిల్లాలో జగనన్న విద్యాదీవెన పథకం కింద ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ త్రైమాసికానికి సంబంధించి 35,635 మంది బీసీ విద్యార్థులు, 4,033 మంది ఎస్సీ, 2,391 మంది ఈబీసీ, 900 మంది కాపు, 655 మంది ఎస్టీ, 248 మంది ముస్లిం, 38 మంది క్రిస్టియన్ విద్యార్థులకు మొత్తం రూ.29.44 కోట్ల లబ్ధి కలిగింది. బొబ్బిలి నియోజకవర్గంలో 6,615 మందికి రూ.4,90,63,690, చీపురుపల్లిలో 5,567 మందికి రూ.3,42,22,155, గజపతినగరంలో 6,952 మందికి రూ.4,42,73,324, నెల్లిమర్లలో 5,709 మందికి రూ.3,60,96,395, రాజాంలో 6,933 మందికి రూ.4,57,26,965, సాలూరులో 1,104 మందికి రూ.68,82,405, ఎస్.కోటలో 5,757 మందికి రూ.3,86,55,325, విజయనగరం నియోజకవర్గంలో 5,263 మందికి రూ.3,9524,614, మొత్తం 43,900 మంది విద్యార్థులకు రూ.29 కోట్ల44లక్షల44వేల873ల ఆర్థిక ప్రయోజనం చేకూరింది.



విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన చెక్కును అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

**సంక్షేమ శాఖల వారీగా జగనన్న విద్యాదీవెన నిధుల విడుదల ఇలా...**

| సంక్షేమ శాఖ | విద్యార్థుల సంఖ్య | నిధులు మంజూరు |
|---|---|---|
| బీసీ | 35,635 | 23,46,12,14 |
| ఎస్సీ | 4,033 | 2,82,22,246 |
| ఈబీసీ | 2,391 | 1,91,40,311 |
| కాపు | 900 | 67,49,117 |
| ఎస్టీ | 655 | 36,79,342 |
| ముస్లిం | 248 | 16,60,056 |
| క్రిస్టియన్ | 38 | 3,80,887 |
| మొత్తం | 43,900 | 29,44,44,873 |

### చదువు బెంగ తీరింది



కూలీనాలీ చేసుకుని జీవిస్తున్నాం. నాకు ఇద్దరు ఆడపిల్లలు. కూలి పని చేస్తూ పిల్లలను ఎలా చదివించాలా? అన్న బెంగ ఉండేది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేస్తున్న విద్యాపథకాలతో ఆ బెంగ తీరింది. నా పెద్దకూతురు డిగ్రీ ఆఖరు సంవత్సరం చదువుతోంది. రెండో కుతూరు బీఎస్సీ ఫస్టియర్ చదువుతోంది. ఇద్దరు పిల్లలకు ఏటా జగనన్నవిద్యాదీవెన, వసతి దీవెన కింద ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తోంది. దీనివల్ల పిల్లల ఉన్నత చదువులు సాఫీగా సాగుతున్నాయి. మా లాంటి లక్షల కుటుంబాల పేద పిల్లల చదువుకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ రుణం తీర్చుకోలేనిది.

– నిరుజోగి కృష్ణమ్మ, విద్యాదీవెన లబ్ధిదారు, వేపాడ

### చదువుకు చక్కని సాయం



డిగ్రీ చదువుకోసం పూసపాటిరేగ మండలంలోని వ్యవసాయ కుటుంబం నుంచి విజయనగరం పట్టణానికి వచ్చాను. ఇక్కడే ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నాను. పేద విద్యార్థుల ఉన్నత విద్యకు జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన కింద ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సహకారం అందిస్తున్నారు. పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ వల్లే చదువు సాఫీగా సాగిపోతోంది.

– ఎ.భవాని, బీఎస్సీ

### సాఫీగా ఉన్నత చదువులు



మధ్యతరగతి కుటుంబం మాది. ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలతో ఉన్నత చదువు అభ్యసించగలుగుతున్నా. క్రమం తప్పకుండా ఫీజులు చెల్లిస్తున్నారు. దీంతో కళాశాలల నుంచి ఒత్తిడిలేదు. ఉన్నత చదువులు సాఫీగా సాగుతున్నాయి. విద్యార్థుల చదువుకు భరోసా కల్పిస్తున్న జగనన్నకు థాంక్స్.

– ఎం.అనూష, బీఎస్సీ విద్యార్థిని

### జగనన్న చల్లని దీవెనతో..



నా పేరు పాకలపాటి ధనలక్ష్మి. మాది మెరకముడిదాం మండలంలోని సోమలింగాపురం గ్రామం. చీపురుపల్లిలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాను. జగనన్న విద్యాదీవెన కింద పూర్తి ఫీజురీయింబర్స్ మెంటన్‌ను నాలుగు విడతల్లో అందిస్తున్నారు. జగనన్న దయతో చదువుకు ఆర్థిక కష్టాలు దూరమయ్యాయి. చక్కగా చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడతానన్న నమ్మకం ఉంది.

## న్యూస్‌రీల్

### ఆస్పత్రిలో సేవల పరిశీలన

- పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ ఇన్వెస్టిగేటర్ రమణ



సమావేశంలో మాట్లాడుతున్న రమణ

విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో అందించే సేవలను పరిశీలించనున్నట్టు పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ (పీఆర్‌సి) ఇన్వెస్టిగేటర్ డాక్టర్ వై.రమణ అన్నారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రోగ్రాం అధికారులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. ఆస్పత్రుల్లో ప్రసవ సేవలు, వైద్యుల పనితీరు, మౌలిక వసతుల కల్పన, వైద్యపరికరాల వినియోగం తదితర అంశాలను పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. సమావేశంలో రీసెర్చ్ ఫెలో టి.శ్రీనివాస్, డీఎంహెచ్‌ఓ భాస్కరరావు పాల్గొన్నారు.

### బొద్దూరు విద్యార్థుల ప్రతిభ



జాతీయ స్థాయి భాగవతం పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సంతకవిటి: అంతర్జాతీయ భాగవత ఆణిముత్యాల సంస్థ (బెంగళూరు) ఆన్‌లైన్‌లో నిర్వహించిన పోటీల్లో బొద్దూరు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం మల్లేశ్వరరావు తెలిపారు. తెలుగు ఉపాధ్యాయుడు పి.కృష్ణ విద్యార్థులకు భాగవతం పద్యాలపై శిక్షణ ఇచ్చారన్నారు. ఎంపికైన విద్యార్థులను స్టాఫ్ కార్యదర్శి ధామోదరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

### నేడు స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ నైరెడ్‌లో ఈ నెల 29న ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఆసక్తిగల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని డైరెక్టర్ కె.శశిధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసుగల నిరుద్యోగ స్త్రీ, పురుషులు అర్హులని పేర్కొన్నారు. పురుషులకు కార్ డ్రైవింగ్‌లో 30 రోజులు పాటు శిక్షణ ఉంటుందన్నారు. స్త్రీలకు లేడీస్ టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, హోమ్ నర్సింగ్‌లలో 30 రోజులపాటు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యేవారు పదో తరగతి మార్కుల లిస్టు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డుతో పాల్గొనాలని సూచించారు. శిక్షణ కాలంలో భోజన, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 90147 16255, 94917 41129, 98669 13371 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### పేదింటి విద్యార్థినికి ఉన్నత విద్యావకాశం



విట్ నుంచి వచ్చిన ప్రవేశ పత్రాన్ని నందినికి అందజేస్తున్న ప్రిన్సిపాల్ కుమారస్వామి

వీరఘట్టం: కార్పొరేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో 35 శాతం సీట్లను ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో చదువుకునే మెరిట్ విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలనే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి నిర్ణయం పేద విద్యార్థులకు వరంగా మారింది. ప్రభుత్వ నిర్ణయంతో వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుని ఇంటర్మీడియట్ ఎంపీసీలో 949 మార్కులు సాధించిన శీలా నందినికి అమరావతిలోని విట్–ఏపీ యూనివర్సిటీలో బీటెక్ కంప్యూటర్ సైన్స్‌లో ఉచిత సీటు దక్కింది. ఒక ల్యాప్‌టాప్‌ను వర్సిటీ సిబ్బంది అందజేశారు. కోర్సును అభ్యసించే నాలుగేళ్లు ఉచిత భోజనం, వసతి కల్పిస్తున్నట్టు వర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జాన్ ప్రదీప్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కళాశాల్లో చదవాలంటే ఏడాదికి రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ముఖ్యమంత్రి నిర్ణయంతో నందినికి అన్ని వసతులు ఉచితంగానే అందనున్నాయి. నందిని తండ్రి గురుమూర్తి సాధారణ మెకానిక్. కుమార్తెకు ఇటీవల జగనన్న ఆణిముత్యాల కింద రూ.50 వేలు రివార్డు అందడం, ఇప్పుడు ఉచితంగా ఇంజినీరింగ్ సీటు లభించడంతో జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. విట్ నుంచి వచ్చిన జాయినింగ్ లెటర్‌ను వీరఘట్టం జీజేసీ ప్రిన్సిపాల్ కుమారస్వామి సోమవారం అందజేశారు.

## నేటి నుంచి పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

- జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్

విజయనగరం రూరల్: గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 29 నుంచి వచ్చేనెల 30వ తేదీవరకు ఐదు బ్యాచ్‌లకు ఆరు రోజుల చొప్పున శిక్షణ ఇస్తామని జిల్లా పరిషత్ సీఈఓ కె.రాజ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఒక్కో బ్యాచ్‌కు 50 మంది చొప్పున విజయనగరం జిల్లాలోని 713 మంది, పార్వతీపురం మన్యం జిల్లాలోని 401 మంది పంచాయతీ కార్యదర్శులకు ఐదు బ్యాచ్‌లుగా శిక్షణను పూర్తిచేస్తామని స్పష్టంచేశారు. ఈ నెల 29 నుంచి సెప్టెంబర్ 3 వరకు మొదటి బ్యాచ్, 4 నుంచి 9 వరకు రెండో బ్యాచ్, 11 నుంచి 16 వరకు మూడో బ్యాచ్, 19 నుంచి 24 వరకు నాలుగో బ్యాచ్, 25 నుంచి 30వ తేదీవరకు చివరి బ్యాచ్‌కు శిక్షణ ఉంటుందని తెలిపారు. విజయనగరం జిల్లా పంచాయతీ కార్యదర్శులకు వీటీ అగ్రహారం టీటీడీసీలో, పార్వతీపురం కార్యదర్శులకు కణపాక యూత్ హాస్టల్‌లో శిక్షణ జరుగుతుందని వివరించారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయి శిక్షణ పూర్తిచేసుకున్న మాస్టర్ శిక్షకులతో పంచాయతీ రోజువారీ పరిపాలనపై మరింత మెరుగైన అవగాహన తీసుకురావడానికి అవసరమైన అంశాలను బోధిస్తామన్నారు. పంచాయతీరాజ్ చట్టం, జిల్లా కార్యాలయ మాన్యువల్, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, లేఅవుట్ల అనుమతులు, సుస్థిరాభివృద్ధి, స్వమిత్వ (గ్రామాల్లో మెరుగైన సాంకేతికతతో కూడిన సర్వే, మ్యాపింగ్ కోసం ఏర్పాటు చేసిన పథకం)పై శిక్షణ ఉంటుందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు వారికి కేటాయించిన బ్యాచ్‌లో, నిర్ణీత సమయానికి హాజరై శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విశ్రాంత డీఎంహెచ్‌ఓపై విచారణ

- కోవిడ్, ఎన్‌ఎంహెచ్ నిధులు దుర్వినియోగం చేశారని కమిషనర్‌కు ఫిర్యాదు



విచారణ చేపడుతున్న జేడీ దేవసాగర్

విజయనగరం ఫోర్ట్: నిధుల దుర్వినియోగం చేశారన్న ఫిర్యాదుమేరకు విజయనగరం జిల్లా డీఎంహెచ్‌ఓగా పనిచేసి ఉద్యోగవిరమణ పొందిన డాక్టర్ ఎస్.వి.రమణకుమారిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం విచారణ జరిగింది. కోవిడ్ సమయంలో క్వారంటైన్ సెంటర్ల నిర్వహణ, కంప్యూటర్ల కొనుగోలు, శాంపిల్స్ ట్రాన్స్‌పోర్టు వంటి సేవలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో పాటు ఎన్‌హెచ్‌ఎం(నేషనల్ హెల్త్ మిషన్) నిధులను డీఎంహెచ్‌ఓగా పనిచేసిన రమణకుమారి, ఎన్‌హెచ్‌ఎం అకౌంట్స్ ఆఫీసర్, అప్పటి అకౌంట్స్ సూపరింటెండెంట్ కలిసి పక్కదారి పట్టించారని హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్‌కు కొద్ది నెలల కిందట ఫిర్యాదు అందింది. దీనిపై విచారణాధికారిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ దేవసాగర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో విచారణ చేపట్టారు. కోవిడ్, ఎన్‌హెచ్‌ఎం నిధుల ఖర్చు, బిల్లులు, రికార్డులు తనిఖీ చేశారు. నివేదికను కమిషనర్‌కు అందజేస్తానని చెప్పారు.

## అమ్మభాషకు అక్షర వందనం



వ్యవహారిక భాషోద్యమనేత, బహుముఖ ప్రజ్ఞాశాలి గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని ఏటా ఆగస్టు 29న తెలుగు భాషాదినోత్సవాన్ని నిర్వహించుకుంటాం. ఈ సందర్భంగా రాజాం మండలం పెనుబాక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు అమ్మభాషకు అక్షర శుభాకాంక్షలు తెలిపారు. 'అ' ఆకారంలో కూర్చొని అక్షర చైతన్యం కల్పించారు. తేనెలాంటి తియ్యనైన భాష తెలుగు భాష అంటూ నినదించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మహేశ్వరరావు, హిందీ ఉపాధ్యాయుడు కె.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

– రాజాం

## పరారీలోనే ట్రాన్స్‌కో ఏఈ



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఏఈ కారు

మక్కువ/విజయనగరం ఫోర్ట్:

విద్యుత్‌కనెక్షన్ మంజూరుకు మక్కువ మండలం ములక్కావలసకు చెందిన రైతు డి.ఈశ్వరరావు నుంచి ట్రాన్స్‌కో ఏఈ పోలాకి శాంతారావు రూ.60వేలు డిమాండ్ చేయడం... ఇప్పటికే రైతు రూ.20 వేలు చెల్లించగా.. మిగిలిన రూ.40వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు ఏఈపై దాడిచేయడం.. ఆ సమయంలో అధికారులను గుర్తించి పొలాల్లోకి ఏఈ కారు వేగంగా నడపడం.. ఆయనను బైక్‌తో వెంబడించిన సీఐను కారుతో ఢీకొట్టి గాయాలు పాలు చేసిన విషయం తెలిసిందే. ఏసీబీ అధికారులకు ఆదివారం రాత్రి చిక్కినట్టే చిక్కి పరారైన ట్రాన్స్ కో ఏఈ శాంతారావు ఆచూకీ 24 గంటలు గడచినా లభ్యం కాలేదు. ఏఈ ఆచూకీకోసం పోలీసులు జల్లెడపడుతున్నారు. ఏసీబీ డీఎస్పీ రామచంద్రరావు విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులకు ఫోన్‌లో సంప్రదించారు. సరెండర్ అయ్యేలా సహకరించాలని కోరారు. ఆయన ఆచూకీ ఆ శాఖ అధికారులకూ దొరకకపోవడం గమనార్హం. శాంతారావు ఫోన్ నంబర్‌ను ఏసీబీ అధికారులు లోకేషన్ ట్రాప్ చేస్తున్నా.. పాపయ్యవలస గ్రామ సమీపంలోని పంట పొలాల వద్దే సిగ్నల్స్ చూపిస్తోంది. ఏఈ తన ఫోన్‌ను పొలంలో విసిరేసినట్టు ఏసీబీ అధికారులు భావిస్తున్నారు.

### ఏఈ కారును సీజ్ చేసిన అధికారులు

ఏఈ శాంతారావు కారును పాపయ్యవలస గ్రామ సమీపంలోని పంట పొలాల మధ్యలో వదిలేసి పరారవ్వడంతో కారును ఏసీబీ అధికారులు సోమవారం సీజ్ చేసి మక్కువ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇంతవరకు ఏఈ ఇంటికి గాని, స్నేహితుల ఇంటికి గాని ఆయన చేరలేదు. అధికారుల కళ్లుగప్పి పరారీలో ఉన్న ఏఈ అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

### ఆది నుంచీ అంతే...

ఏఈ పోలాకి శాంతరావుపై ఆదినుంచి అవినీతిపరుడన్న ముద్ర ఉంది. విద్యుత్‌శాఖలో కాంట్రాక్టర్‌గా ప్రస్థానం ప్రారంభించిన ఆయన ఆ శాఖలోని లొసుగులన్నీ తెలుసుకున్నాడు. అదే శాఖలో జూనియర్ ఇంజినీర్‌గా ఉద్యోగంలో చేరాడు. ఎక్కడ ఏ పని చేస్తే డబ్బులు వస్తాయో తెలుసుకున్న శాంతారావు... ఆ మార్గాన్నే ఎంచుకున్నాడన్న విమర్శలు ఉన్నాయి. డెంకాడ, విజయనగరంలోని డీ–2 సెక్షన్, గంటస్తంభం ఏరియా, డి–3 విజయనగరం, వి.టి.అగ్రహారం ప్రాంతంలో పనిచేసి ఇటీవల మక్కువ మండలానికి బదిలీపై వెళ్లాడు. విద్యుత్‌స్తంభాలు మార్పు చేసినా, లైన్‌ను మార్చినా, అపార్ట్ మెంట్లు, ఇళ్లకు కనెక్షన్లు మంజూరు చేయాలన్నా చేయితడపాల్సిందే. లేదంటే పని పూర్తికాదన్న ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. వ్యవసాయ కనెక్షన్ల కోసం రైతుల నుంచి ఎక్కువగా డబ్బులు వసూలు చేశారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అతనికి రాష్ట్ర స్థాయిలో విద్యుత్‌శాఖ ఉద్యోగుల సంఘం నాయకుడు ఒకరు బంధువు కావడంతో అవినీతికి పాల్పడినా ఏ ఒక్కరూ తనను ఏమి చేయారనే ధీమాతో ఉండేవారు. విజయనగరం, డెంకాడ మండలాల్లో పనిచేసినప్పుడు అనేక అవినీతి ఆరోపణలు వచ్చినా, ఎవరూ ఫిర్యాదు చేయడానికి ముందుకు రాలేదు. ఎట్టకేలకు మక్కువకు చెందిన రైతు ఏఈ అవినీతి దాహానికి తట్టుకోలేక ధైర్యంగా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. అయితే, ఆయన ఏసీబీ అధికారుల కళ్లుగప్పి పరారుకావడం ఆ శాఖ అధికారులను విస్మయం కలిగిస్తోంది.

## పల్లె ముంగిటకే ప్రభుత్వ సేవలు



వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనం ప్రారంభోత్సవంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, తదితరులు

- వైఎస్సార్‌సీపీతో గ్రామ స్వరాజ్యం సాకారం
- టీడీపీది ఓట్ల రాజకీయం
- సంక్షేమం, అభివృద్ధే జగనన్న ధ్యేయం
- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- కోరుకొండలో ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రాలు ప్రారంభం

విజయనగరం రూరల్:

గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని సాకారం చేస్తూ.. పల్లెముంగిటే అన్ని రకాల ప్రభుత్వ సేవలందేలా సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తెచ్చారని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావులు అన్నారు. విజయనగరం మండలం కోరుకొండ గ్రామంలో సోమవారం రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ (వెల్‌నెస్ కేంద్రం)లను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో రైతులు విత్తనాలు, ఎరువుల కోసం మండల కేంద్రాలకు, పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేదని, అక్కడ క్యూలో గంటల తరబడి నిరీక్షించి లాఠీ దెబ్బలు తింటేగాని దొరికేవికాదని గుర్తుచేశారు. నేడు ఆ పరిస్థితి లేదన్నారు. పల్లెల్లో ఏర్పాటుచేసిన ఆర్‌బీకేలలో రైతులకు కావాల్సిన విత్తనాలు దొరుకుతున్నాయన్నారు. ధ్రువపత్రాలు, వివిధ పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటుతో గ్రామీణ ప్రజలకు ఆరోగ్యభరోసా కలుగుతోందని తెలిపారు. కోరుకొండ సచివాలయం పరిధిలోని కోరుకొండ, కోరుకొండపాలెం పంచాయతీల్లో 1426 గడపలుంటే, నాలుగేళ్ల కాలంలో సుమారు రూ.18.50 కోట్లను వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యాయని వివరించారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామని, స్థానికంగా యువత కోసం వ్యాయామశాలకు అవసరమైన పరికరాలను జెడ్పీ నిధుల నుంచి సమకూరుస్తామని హామీనిచ్చారు. రెండు గ్రామాల్లో రూ.కోటి ఖర్చుతో మూడు ప్రభుత్వ భవనాలను నిర్మించినట్టు వెల్లడించారు. ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ఎన్నికల రాజకీయాలు చేయలేం

గత టీడీపీ మాదిరి ఎన్నికల రాజకీయాలు చేయలేమని జెడ్పీ చైర్మన్ స్పష్టం చేశారు. ఎన్నికలొస్తున్నాయనే చంద్రబాబు, టీడీపీ నాయకులు ప్రజల వద్దకు వస్తున్నారని విమర్శించారు. గత ఎన్నికల ముందు పసుపు కుంకుమ అని డ్రామాలాడారని, ఈ నాటకాలు గ్రహించారు కనుకనే పసుపు చంద్రబాబు ముఖానికి రాసి, వీర కుంకుమను జగన్‌కు ప్రజలు దిద్దారని గుర్తుచేశారు.

### అవినీతిరహిత పాలన అందిస్తున్నాం

నాలుగేళ్ల కాలంలో అవినీతిరహిత పాలన అందిస్తున్నామని గర్వంగా చెప్పగలుగుతున్నామని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. కోరుకొండ పంచాయతీ అంటే తనకు ప్రత్యేక అభిమానమని, అత్యధిక మెజారిటీ ఇక్కడ నుంచే వచ్చిందని గుర్తుచేశారు. ఈ ప్రాంత అభివృద్ధి తన బాధ్యతని తెలిపారు. గత ప్రభుత్వం మాదిరి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాల మంజూరులో పథకానికో రేటు పెట్టే పరిస్థితి లేదన్నారు. టీడీపీని నమ్మితే ఇప్పుడొస్తున్న పథకాలన్నీ నిలిచిపోతాయన్న విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని, లైన్‌మన్‌ను నియమిస్తామని, ఇతర పెండింగ్ పనులనూ పూర్తి చేస్తామని మాటిచ్చారు. అనంతరం జెడ్పీ చైర్మన్, కోలగట్లను స్థానిక ప్రజా ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షులు కెల్ల త్రినాథ్, సర్పంచ్ మైలపల్లి శంకరరావు, మాజీ సర్పంచ్ లగుడు శివాజీ, వైఎస్సార్ సీపీ నాయకుడు ఎస్.శ్రీనివాసరావు, ఎంపీడీఓ గంటా వెంకటరావు, తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### 440 లీటర్ల సారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సారాతో ఎస్‌ఈబీ సీఐ ఉపేంద్ర, రూరల్ ఎస్‌ఐ సింహాచలం

**పార్వతీపురంటౌన్:** మండలంలోని ఎమ్మార్‌నగరం గ్రామ సమీపంలో ఆటోలో తరలిస్తున్న 440 లీటర్ల సారాను పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి, ఒడిశాకి చెందిన ఆటోడ్రైవర్ కొండగొర్రి అజిత్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదే ఘటనకు సంబంధించి, బలిజిపేట మండలానికి చెందిన మరో వ్యక్తిపై కూడా నమోదు చేశామని పోలీసులు పేర్కొన్నారు.

### 'దాసరి'కి ఎస్వీఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



తిరుపతినాయుడును అవార్డుతో సత్కరిస్తున్న దృశ్యం

**విజయనగరం టౌన్:** ప్రముఖ రంగస్థల నటుడు, విశ్రాంత తెలుగు పండిట్ దాసరి తిరుపతినాయుడుకు ఎస్వీ రంగారావు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ నగరంలో రవీంద్రభారతిలో ఆ రాష్ట్ర ఇరిగేషన్ బోర్డు చైర్మన్ వేణుగోపాలాచారి చేతులమీదుగా ఆయన సోమవారం అవార్డును అందుకున్నారు. 1980లో నాటకరంగంలో ప్రవేశించి, 42 పౌరాణిక, సాంఘిక నాటకాలు, మరో 2,500 ప్రదర్శనలు ఇచ్చారు. 2013లో సినీరంగంలో ప్రవేశించి, ఇప్పటివరకు మొత్తం 16 సినిమాల్లో నటించారు. ఆయనకు అవార్డు రావడం పట్ల ఆయన స్వగ్రామం బాడంగిలోని కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఆనందం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు చెబుతున్నారు.

### తెలుగు భాషా పరిరక్షణే ధ్యేయం



ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

**విజయనగరంటౌన్:** తెలుగు భాషా పరిరక్షణే ధ్యేయమని వాగ్దేవి సమారాధనమ్, జై పైడిమాంబ వేద సంస్కృత పరిరరక్షణ సేవాసంఘం వ్యవస్థాపకులు పెన్నేటి స్వప్నహైందవి అన్నారు. తెలుగు భాషా వారోత్సవాల్లో భాగంగా స్థానిక గురజాడ స్వగృహంలో విద్యార్థులకు పద్యపఠనం, వ్యాసరచన, కథలు, కవితలు, క్విజ్‌పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు భాషపై మక్కువ పెంచేందుకు విద్యార్థుల మధ్య నిర్వహించిన ఈ పోటీలకు అనూహ్య స్పందన లభించిందన్నారు. ఈ పోటీలకు తొమ్మిది పాఠశాలల నుంచి మొత్తం 500 మంది విద్యార్థులు హాజరు కాగా, సీబీఎస్ఈ ఫోర్ట్‌సిటీ స్కూల్, స్టేట్ సిలబస్ ఫోర్ట్ సిటీ స్కూల్, అమర్ స్కూల్ విద్యార్థులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకుని, మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు గురజాడం గ్రంథాలయంలో విజేతలకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గురజాడ ఇందిర, బి.సూర్యలక్ష్మి, అమ్మాజమ్మ, జి.చంద్రశేఖర్, పార్వతీదేవి తదితరులు పాల్గొన్నారు.

### కోడిగుడ్ల ధరలు

| హోల్‌సేల్ ధరలు | (100 గుడ్లు) |
|---|---|
| విశాఖపట్నం | రూ. 475.00 |
| విజయనగరం | రూ. 479.00 |
| శ్రీకాకుళం | రూ. 479.00 |

### బులియన్

| విశాఖపట్నం | |
|---|---|
| బంగారం(24సి. 10గ్రా.) | 60,380-00 |
| బంగారం(22సి. 10గ్రా.) | 55,350-00 |
| వెండి (కిలో) | 80,000-00 |

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹131 | ₹232 | ₹ 242 |

# అర్జీలకు సత్వర పరిష్కారం...

● 'జగనన్నకు చెబుదాం'కు 146 వినతులు..



విజయనగరం అర్బన్: స్పందన సమస్యల పరిష్కారంపై ఆరాతీస్తున్న జేసీ మయూర్ అశోక్

**విజయనగరం అర్బన్:** జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం దృష్టికి వచ్చిన ప్రతీ ప్రజాసమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని జేసీ మయూర్ అశోక్ ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో స్పందన కార్యక్రమం ద్వారా వెలుగుచూసిన సమస్యల పరిష్కారం, అర్జీదారులు అసంతృప్తి వ్యక్తం చేసిన సమస్యలపై జేసీ సమీక్షించారు. ప్రజలు సమర్పిస్తున్న ప్రతీ వినతిని పరిశీలించి, ఆ సమస్య పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఏ సమస్య అయినా ఏదైనా కారణం చేత పరిష్కారం కాకపోతే ఆ కారణాన్ని కూడా అర్జీదారునికి తెలియజేయాలన్నారు. గృహనిర్మాణ సంస్థకు సంబంధించిన అర్జీల పరిష్కారంపై ఆ శాఖ పీడీ శ్రీనివాస్ వివరణ ఇచ్చారు. ఇదిలా ఉండగా, కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి 146 వినతులు వచ్చాయి. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 110, ఏపీఈపీడీసీఎల్‌కు సంబంధించి, 01, జిల్లా వైద్యారోగ్య శాఖకు సంబంధించి, 10, జిల్లా పంచాయతీ అధికారికి 09, మున్సిపల్ శాఖకు 12, డీఆర్‌డీఏకి 17, గ్రామ, వార్డు సచివాలయ శాఖకు 03 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్‌డీవో ఎం.వి.సూర్యకళ, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, భూసేకరణ అధికారులు బి.సుదర్శన దొర, పద్మలత తదితరులు పాల్గొని, ఆయా వినతులు పరిశీలించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

**పార్వతీపురం:** స్పందన కార్యక్రమం ద్వారా తలెత్తిన ప్రజాసమస్యలను తక్షణమే పరిష్కరించాలని జేసీ ఆర్.గోవిందరావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ వివిధ సమస్యల పరిష్కారానికి ప్రజలు సమర్పించిన మొత్తం 87 అర్జీలను స్వీకరించి, పరిశీలించారు. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కారమయ్యేలా చూస్తామని అర్జీదారులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి బి.జగన్నాథరావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావు, డీపీవో బి.సత్యనారాయణ, డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర రాజు, జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్, ఐసీడీఎస్ పీడీ కె.విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.

**పార్వతీపురంటౌన్:** స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారంపై అర్జీలు పెట్టుకున్న వారికి సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన(జగనన్నకు చెబుదాం) కార్యక్రమం దృష్టికి వచ్చిన పలు వినతులను ఎస్పీ పరిశీలించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో వారు కుటుంబ కలహాలు, వేధింపులు, సివిల్ తగాదాలను పరిష్కరించాలని విన్నవించుకున్నారు. అనంతరం సంబంధిత పోలీస్ అధికారులతో ఎస్పీ స్వయంగా ఫోన్‌లో మాట్లాడి, అర్జీదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏదైనా సమస్యపై స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసిన వ్యక్తి మళ్లీ అదే సమస్య పరిష్కారానికి పదేపదే పోలీసుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా చూడాలన్నారు. మీరు తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీస్ కార్యాలయానికి పంపాలని సూచించారు. సైబర్ నేరాలపై వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కారమయ్యేలా చూడాలని, ప్రజలను కూడా సైబర్ నేరాలపై అప్రమత్తం చేయాలని తెలిపారు. సైబర్ నేరాలకు సంబంధించి, ఫిర్యాదు చేయాలనుకుంటే డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్‌క్రైమ్.ఇన్ వెబ్‌సైట్‌లోని సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్(ఎన్‌సీఆర్‌పీ)లో టోల్ ఫ్రీ నంబర్ 1930 కాల్ చేయొచ్చని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ సీహెచ్ లక్ష్మణరావు, డీసీఆర్‌బీ సీఐ ఎన్.వి.ప్రభాకర్‌రావు, ఎస్ఐ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

**విజయనగరం క్రైమ్:** స్పందన కార్యక్రమం దృష్టికి సమస్యలు తీసుకువచ్చిన అర్జీదారులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజయనగరం జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పలువురు సమర్పించిన వినతిపత్రాలను ఆమె స్వీకరించి, పరిశీలించారు. అనంతరం వారితో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత వారి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. స్పందన కార్యక్రమానికి మొత్తం 29 అర్జీలు వచ్చాయని, వాటిల్లో ఫిర్యాదుదారులు పేర్కొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ఒకే సమస్యపై మళ్లీ మళ్లీ స్పందన కార్యక్రమానికి ఫిర్యాదుదారు రాకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, దిశా డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఎస్ఐలు వాసుదేవ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం: వినతులు పరిశీలిస్తున్న జేసీ గోవిందరావు, డీఆర్‌వో వెంకటరావు, పీవో విష్ణుచరణ్



పార్వతీపురం టౌన్: అర్జీదారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్




విజయనగరం క్రైమ్: స్పందన కార్యక్రమంలో అర్జీదారుని సమస్య వింటున్న ఎస్పీ దీపిక

# టీడీపీ నేతలపై పోలీసులకు ఫిర్యాదు



ఎస్ఐ కిరణ్‌కుమార్‌నాయుడుకు ఫిర్యాదుపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్లు



బొండపల్లి: టీడీపీ నేతల తీరుపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు

**గంట్యాడ:** టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ వేమలి శ్రీనివాసరావు, కో-కన్వీనర్లు సుంకరి రామకృష్ణ, ఆదిరెడ్డి శ్రీనివాస్ కలిసి గంట్యాడ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. బహిరంగ సభలు, సమావేశాలు, బస్సుయాత్రల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా వారు ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎంతోమంది అమాయకపు ప్రజలు వారి మాయమాటలు నమ్మి, అనవసరమైన చిక్కుల్లో ఇరుక్కుంటున్నారన్నారు. ఇప్పుడే ఇలాంటివి అరికట్టాలని, లేకపోతే రాష్ట్రం అల్లకల్లోలమవుతుందన్నారు.

**బొండపల్లి:** రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తున్న టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల సోషల్ మీడియా కన్వీనర్లు, కో-కన్వీనర్లు డిమాండ్ చేశారు. ఇదే విషయమై సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, ఎస్ఐ ఎస్.రవికి ఫిర్యాదుపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆయా నేతలు సభలు, సమావేశాలు, బస్సుయాత్ర, పాదయాత్రల్లో హింసను ప్రేరేపించేలా, ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని, ఇది ఎంతమాత్రం సరికాదన్నారు. ఇప్పుడే ఇలాంటి వారిని నిలువరించాలని లేకపోతే భవిష్యత్‌లో ఎన్నో ఘోరాలు చవిచూడాల్సిన దుస్థితి నెలకొంటుందన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో కిలపర్తి సుధాకర్, కోళ్ల వెంకటరమణ, రాపాక మనోహర్, పురమనేని రాములు ఉన్నారు.

## జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆకస్మిక మృతి

**విజయనగరం అర్బన్:** జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్.లలిత(53) సోమవారం ఆకస్మికంగా మృతి చెందారు. స్థానిక పట్టణంలోని ఆమె స్వగృహంలో తెల్లవారుజామున గుండెపోటుకు గురైన ఆమెను సమీపంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే ఆమె ప్రాణాలు విడిచారు. ఈ విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘ జిల్లా అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్, జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి కె.దయానంద్, జిల్లా కేంద్ర గ్రంథాయల సిబ్బంది ఆమె మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆమె స్వస్థలమైన కర్నూలు జిల్లాకు భౌతికకాయాన్ని తరలించారు. ఇదిలా ఉండగా, కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆమె మృతికి జిల్లా అధికార యంత్రాంగం సంతాపం తెలుపుతూ రెండు నిముషాల పాటు మౌనం పాటించారు. అనంతరం ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్‌వో ఎం.గణపతిరావు, ఆర్‌డీవో ఎం.వి. సూర్యకళ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సూర్యనారాయణ, పద్మలత, సుదర్శన దొర తదితరులు పాల్గొన్నారు.



జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మృతికి సంతాపంగా మౌనం పాటిస్తున్న జేసీ మయూర్ అశోక్, ఇతర అధికారులు (ఇన్‌సెట్లో) ఎస్.లలిత(ఫైల్)

## గిరిశిఖర గ్రామానికి ట్రైనీ ఐఏఎస్‌ల బృందం



దిగువ కొండపర్తి పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశమైన ట్రైనీ ఐఏఎస్‌లు

**గంట్యాడ:** మండలంలోని గిరిశిఖర గ్రామమైన దిగువ కొండపర్తిలో ట్రైనీ ఐఏఎస్‌ల బృందం సోమవారం పర్యటించింది. ప్రజల జీవన విధానంపై క్షేత్రస్థాయిలో అధ్యయనం, పరిశోధనలో భాగంగా అక్కడికి వెళ్లిన ట్రైనీ ఐఏఎస్‌లు అక్కడి గిరిజనులకు అందుతున్న ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు, వారి జీవన విధానాన్ని నిశితంగా పరిశీలించారు. అనంతరం అక్కడి పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమై, విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు, ఉపాధ్యాయులు అనుసరిస్తున్న బోధనా విధానాలు, విద్యార్థుల విద్యాసామర్థ్యాలపై ఆరాతీశారు. పర్యటించిన వారిలో ముస్సోరిలో బి.ఎస్.యుగంధర్ గ్రామీణ అధ్యయన సంస్థలో శిక్షణ పొందుతున్న ట్రైనీ ఐఏఎస్‌లు శివరంజని, భారతీమీనా, ప్రిన్సికుమార్, రమేష్‌చంద్ మీనా, మెయిన్ అహ్మద్, అయేషా ఫాతిమా తదితరులు ఉన్నారు.

## ఇద్దరికి తీవ్రగాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

**పార్వతీపురంటౌన్:** ఎదురెదురుగా వస్తున్న రెండు మోటార్‌బైక్‌లు ఢీకొన్న దుర్ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం కొమరాడ మండలంలోని కొత్తవలస గ్రామ సమీపంలో సోమవారం జరిగింది. జిల్లా ఆస్పత్రి అవుట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కొమరాడ మండలం, గుమడ గ్రామానికి చెందిన బొట్టా తిరుపతి.. చినఖేర్జల గ్రామం నుంచి మోటార్‌బైక్‌పై వస్తుండగా విశాఖపట్నం జిల్లా, టి.ఆర్యాపురం మండలం, కొత్తాపల్లి గ్రామానికి చెందిన గంటమల్ల అప్పలరాజు మోటార్‌బైక్‌పై చినఖేర్జల వెళ్తుండగా కొత్తవలస గ్రామం దగ్గరకు వచ్చేసరికి వారి బైక్‌లు ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. దీంతో వారిద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి క్షతగాత్రులను తరలించారు. ఇరువురి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వారిని విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై అవుట్‌పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.


## కరాటే పోటీల్లో విద్యార్థుల సత్తా



సర్టిఫికెట్లతో కరాటే క్రీడాకారులు

**విజయనగరం:** జిల్లా స్థాయి కరాటే పోటీల్లో విజయనగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. కోచ్ కానూరు సంతోష్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో మాట్లాడుతూ పోటీల్లో విజయనగరం జట్టుకు జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం లభించిందన్నారు. డ్రాగన్ పవర్ పంచ్ కరాటే డు-అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తవలసలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. పి.కుశ్వంత్, ఎస్.గీతిక్ వర్మ కుమిటీలో బంగారు, కాటాలో కాంస్య పతకం సాధించగా, పి.హేమంత్ కుమిటీలో కాంస్య పతకం, కాటాలో బంగారు పతకం దక్కించుకున్నారు. అలాగే ఎస్.కార్తీక్, బి.యశ్వంత్‌లు కుముటిలో రజతం, కాటాలో కాంస్య పతకాలు పొందగా, జె.నవీన్ నంద కుమిటిలో రజతం, కాటాలో కాంస్య పతకం సాధించారు. ఆర్.వంశీవరుణ్ రెండు విభాగాల్లోనూ రజత పతాకాలు సాధించారు. బి.శివశ్రీహర్ష, బి.షణ్ముఖ శ్రీకర్, ఎస్.జితేంద్ర రెండు విభాగాల్లోనూ కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. జిల్లా స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను సత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ సాయి దేవమణి, కెన్యూరియో కరాటే అసోసియేషన్ కోచ్ కె.సంతోష్‌కుమార్, అధ్యక్షుడు సుమన్‌లు అభినందించారు.

## 'సమరభేరి' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



సమరభేరి కార్యక్రమ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

**కురుపాం:** కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టబోయే సమరభేరి కార్యక్రమానికి సంబంధించి, రూపొందించిన వాల్‌పోస్టర్‌ను మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.తిరుపతిరావు నేతృత్వంలో సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజావ్యతిరేక విధానాలనే అవలంభిస్తోందని విమర్శించారు. నోట్ల రద్దు దగ్గర నాటి నుంచి జీఎస్టీ, వ్యవసాయ చట్టాలు, ఇంధన ధరల పెంపు అన్నీ ప్రజాగ్రహానికి గురైన నిర్ణయాలేనన్నారు. 2014లో అధికారంలోకి రాకముందు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మాటను ప్రధాని అయ్యాక మోదీ దానిని మర్చిపోయారన్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా ఈ నెల 30వ తేదీ నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు జరిగే సమరభేరి కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. సచివాలయాలు, తహసీల్దారు కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, యు.వాసు, బి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

**ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు..**

విజయనగరం పూల్‌బాగ్: స్థానిక ఎల్‌బీజీ భవనంలో సమరభేరి కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఆ పార్టీ నాయకులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు సమరభేరి కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉద్యోగాలు భర్తీ చేయాలని, నిత్యవసర సరుకుల ధరలు, పెంచిన కరెంట్ చార్జీలు తగ్గించాలని కోరుతూ చేపట్టే ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శంకరరావు, జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, ఎ.జగన్‌మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో రెండు ఆవులు మృతి

● మరో రెండు ఆవుదూడలకు గాయాలు
● ఎం.సీతారాంపురంలో ఘటన



మృతి చెందిన ఆవుదూడను తరలిస్తున్న పాడిరైతులు



ఎం.సీతారాంపురంలో గుంపుగా సంచరిస్తూ దాడులకు ఎగబడుతున్న కుక్కలు

**వంగర:** మండలంలోని ఎం.సీతారాంపురంలో కుక్కల దాడిలో రెండు ఆవులు మృతి చెందగా, మరో రెండు ఆవుదూడలు గాయపడ్డాయి. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. గ్రామంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలు రాత్రి అయితే చాలని పశువుల శాలల్లోని ఆవుదూడలు, ఆవులపై దాడికి ఎగబడుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటివరకు కుక్కల బారినపడి నాలుగు పశువులు మృతి చెందగా, 10 మూగజీవాల వరకు గాయపడ్డాయని తెలిపారు. ఈ విషయంపై బాధితులు బలగ సాయికుమార్, ముదిల పైడిరాజు, ఒమ్మి నాగయ్య, దుప్పాడ సింహాచలం సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. అలాగే కుక్కల బెడద తొలగించాలని కోరారు.

## స్నానానికి వెళ్లి, మృత్యువాత




ఆస్పత్రిలో ప్రవీణ్‌కుమార్ మృతదేహం

**వేపాడ:** కాలువలో స్నానానికి దిగిన కానిస్టేబుల్ నెక్కళ్ల ప్రవీణ్‌కుమార్(35) మృతి చెందారు. ఈ విషాద ఘటన మండలంలోని కృష్ణారాయుడుపేటలో ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. స్నానం చేసేందుకు కృష్ణారాయుడుపేట జంక్షన్ వద్ద ఉన్న రైవాడ కాలువ దగ్గరకు వెళ్లిన ప్రవీణ్‌కుమార్ కాలువలోకి దిగే క్రమంలో ప్రమాదవశాత్తు నాచుమొక్కలు ఎక్కువగా ఉన్న ప్రాంతంలోకి జారిపోయాడు. నాచుమొక్కలు కాళ్లకు చుట్టుకుపోవడంతో బయటకు రాలేక, ఊపిరాడక చనిపోయారు. అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు ఆయనను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారని వల్లంపూడి ఎస్ఐ రాజేష్ తెలిపారు. సోమవారం మృతుడి తండ్రి నెక్కళ్ల సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ప్రవీణ్‌కుమార్ విజయనగరం ఏపీఎస్పీ బెటాలియన్-5లో పనిచేస్తుండగా, ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## బ్రెయిన్ కేన్సర్‌తో గిరిజన విద్యార్థిని మృతి



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ప్రమీల(ఫైల్)



హిమరిక ప్రమీల(ఫైల్),

**గుమ్మలక్ష్మీపురం:** బ్రెయిన్ కేన్సర్‌తో గిరిజన విద్యార్థిని హిమరిక ప్రమీల(13) విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి.. కొమరాడ మండలంలోని గాజులగూడకు చెందిన ప్రమీల గుమ్మలక్ష్మీపురం మండలం, రేగిడి గ్రామంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈ నెల 13వ తేదీన జ్వరం రావడంతో పాఠశాల సిబ్బంది కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి, వైద్యసేవలు అందజేశారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ కూడా నయం కాకపోవడంతో ఈ నెల 14వ తేదీన విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించగా, ప్రమీలకు బ్రెయిన్ ట్యూమర్ ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో శస్త్రచికిత్స చేసేందుకు వైద్యులు సిద్ధం కాగా, ప్రమీల శరీరం సహకరించడం లేదు. అలా చికిత్స అందిస్తుండగా, ఒకానొక దశలో ఊపిరి తీసుకోవడం ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో ఐసీయూకి తరలించి, ఆక్సిజన్ సదుపాయం కల్పించినా ఫలితం లేదని, చికిత్స పొందుతూ మృతి చెందిందని ఏటీడబ్ల్యూవో సురేష్‌కుమార్ తెలిపారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.